క్లుప్తంగా

నరసాపురంలో కొబ్బరి రైతుల ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కొబ్బరి రైతులు

నరసాపురం: కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ కొబ్బరి రైతుల సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కొబ్బరి రైతులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సంఘ జిల్లా కన్వీనర్ తూటే మర్టిన్‌లూథర్ మాట్లాడుతూ రైతులకు వెయ్యి కొబ్బరికాయలకు రూ.15 వేలు చొప్పున ఇచ్చి ఆదుకోవాలని కోరారు. తొలుత స్థానిక మీరా భవన్‌లో సంఘ సదస్సు నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్ , కో కన్వీనర్‌లుగా మర్టిన్‌లూథర్, కడలి నాగరాజుతో పాటు మరో 13 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

చిత్రలేఖనం పోటీల విజేతలు వీరే



బహుమతులకు ఎంపికైన చిత్రాలు

సాక్షి, భీమవరం: మహాత్మాగాంధీ 154వ జయంతి సందర్భంగా జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో గాంధీజీ సత్యం – అహింస విధానాలు నాడు – నేడు అనే అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతల వివరాలను మంగళవారం మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు వెల్లడించారు. జూనియర్స్ విభాగంలో టీడీఎస్ శ్రావణి (మేడపాడు), శ్రీనిధిలాస్య (భీమవరం), వి.జ్యోతివైష్ణవి (దండగర్ర), సీనియర్స్ విభాగంలో ఎం శ్రీలక్ష్మీ అనూహ్య శ్యామలాంబిక (పెదనింద్రకొలను), నక్కా ఎస్తేరురాణి (పాలకోడేరు), బీసీహెచ్ శరవన్ (ఏలూరు) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. కళాశాల విభాగంలో కె.సుష్మిత (భీమవరం), జె.శ్యామలగౌరి (భీమవరం), పీసీహెచ్‌కే నాగవినయ్ (నూజివీడు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. విజేలతకు అక్టోబర్ 2న పెదనింద్రకొలను మహాత్మాగాంధీ భవనంలో బహుమతులు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలి

సాక్షి, భీమవరం: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం భీమవరంలో చలో కలెక్టరేట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌కు శాశ్వత భవనాలు నిర్మించాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని, ఎయిడెడ్ ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతోన్న విద్యార్థులకు కూడా విద్యా దీవెన వసతి, దీవెన అమలు చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

గణేశుని నిమజ్జనం

అత్తిలి: మండలంలోని గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అత్తిలి శివారు గోగులమ్మపేటలో నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని మంగళవారం ఊరేగింపు చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణపతి ప్రతిమను ఉంచి, మేళతాళాలు, తీన్‌మార్ డప్పులతో అత్తిలి పురవీధులలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కాలువలో స్వామివారి ప్రతిమను నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా చవితి ఉత్సవాలు

పెంటపాడు: మండలంలో వినాయక చవితి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా పెంటపాడు బజారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మంగళవారం ఊరేగించారు. వర్తకసంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. జట్లపాలెం గ్రామంలోని గౌడసంఘం ఆధ్వర్యంలో చవితిమహోత్సవాలు పురస్కరించుకొని గ్రామంలో మంగళవారం సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు. పార్టీ నాయకులు కట్టుబోయిన కృష్ణప్రసాద్, సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, ఉపసర్పంచ్ చెరుకు సూర్యనారాయణ, గౌడసంఘ యూత్ సంఘం, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పెంటపాడు మేదర్ల సెంటర్‌లోని గణపతిని మంగళవారం గ్రామంలో ఊరేగించి కాలువలో నిమజ్జనం చేశారు.

పేకాట స్థావరంపై దాడి

పెంటపాడు: మండలంలోని జట్లపాలెం పంట పొలాల్లో పేకాట శిబిరాలపై పెంటపాడు పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 5 గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ. 9100 స్వాధీనం చేసుకొన్నామని ఎస్సై డి. హరికృష్ణ తెలిపారు.

సార్వాకు పుష్కలంగా ఎరువులు

- మొగల్తూరు, నరసాపురం మండలాల ఆర్‌బీకేల్లో అందుబాటులో..
- ఆర్‌బీకేలతో పాటు సొసైటీల్లోనూ సిద్ధంగా ఎరువులు

మొగల్తూరు: సార్వా సాగుకు అవసరమైన ఎరువులు రైతులకు పుష్కలంగా అందుబాటులోకి వచ్చాయి. మొగల్తూరు, నరసాపురం మండలాల్లో సార్వా సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందుగా ఊడ్చిన చేలతో పాటు ఆలస్యంగా ఊడుస్తున్న సాగును అంచనా వేసిన అధికారులు రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎరువులను రైతు భరోసా కేంద్రాలతో పాటు సొసైటీల్లోనూ సిద్ధంగా ఉంచారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా..

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు రైతులు చేపట్టే సాగుకు అవసరమైన ఎరువులను సిద్ధం చేశారు. మొగల్తూరు మండలంలోని 13 ఆర్‌బీకేలు, నరసాపురం మండలంలోని 23 ఆర్‌బీకేల్లో ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచారు. మొగల్తూరు మండలంలో సుమారు 1,198 ఎకరాల్లో సాగు చేపడతారని అధికారులు అంచనా వేయగా, అందుకు అనుగుణంగా ఎరువులను కూడా సిద్ధం చేశారు. మండలంలో కాంప్లెక్స్ ఎరువు 34.45 మెట్రిక్ టన్నులు, డీఏపీ 4 మెట్రిక్ టన్నులు, యూరియా 57.87 మెట్రిక్ టన్నులు, పొటాష్ 20.05 టన్నులు, సూపర్ 20 మెట్రిక్ టన్నులను అందుబాటులో ఉంచారు. నరసాపురం మండలంలో సుమారు 9 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా కాంప్లెక్స్ ఎరువులు 77 మెట్రిక్ టన్నులు, యూరియా 138 మెట్రిక్ టన్నులు, పొటాష్ 55.2 మెట్రిక్ టన్నులు, సూపర్ 20 మెట్రిక్ టన్నుల ఎరువులను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలు, సొసైటీల్లో సిద్ధం చేశారు.



మొగల్తూరు ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్న ఎరువులు

అవసరమైతే మరిన్ని ఎరువులు



సార్వా సాగుకు అవసరమయ్యే ఎరువులను సిద్ధం చేశాం. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని రైతు భరోసా కేంద్రాలతో పాటు సొసైటీల్లో ఎరువులు లభించేలా ఏర్పాట్లు చేశాం. అవసరమైతే మరిన్ని ఎరువులు రప్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు కూడా ఎక్కువ మోతాదులో ఎరువులు వాడకుండా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి.
– ఈదా అనిల్‌కుమారి, ఏడీఏ, నరసాపురం

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో ఎరువుల వివరాలు

మొగల్తూరు ఆర్‌బీకేలు	ఎరువుల రకాలు	మెట్రిక్ టన్నులు
13	20–20–13	34.45
	డీఏపీ	4
	యూరియా	57.87
	పొటాష్	20.65
	సూపర్	20
నరసాపురం		
23	20.20.13	77
	యూరియా	138
	పొటాష్	55.2
	సూపర్	20

భూసర్వేతో రైతులకు మేలు



మాట్లాడుతున్న తహసీల్దారు గురుమూర్తి రెడ్డి

పెనుగొండ: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షతో ఎంతో మేలు చేకూరుతుందని తహసీల్దారు ఎస్.గురుమూర్తి రెడ్డి అన్నారు. మంగళవారం పెనుగొండలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. భూ సర్వేతో కలిగే ప్రయోజనాలను వివరించారు. పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ, ఎంపీటీసీలు తాడి సుబ్బిరెడ్డి, నక్కా పద్మ, ఆర్ఐ కిరణ్‌కుమార్, సర్వేయర్లు పాల్గొన్నారు.

అఖండ అన్నసమారాధన

పెనుగొండ: గణపతి నవరాత్రుల్లో భాగంగా మంగళవారం మండలంలోని పలు చలువ పందిళ్లలో కొలువుదీరిన గణపతి ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్ధాంతం చింతలపాలెం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యాన వినాయక నిమజ్జనం పూర్తి కావడంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. చింతలపాలెం సంఘ పెద్దలు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వేగంగా హిందూ శ్మశానవాటిక అభివృద్ధి

- రూ.1.98 కోట్లతో పనులు
- అధునాతన సౌకర్యాల కల్పన

నరసాపురం: నరసాపురంలో గోదావరి గట్టున కొండాలమ్మగుడి సమీపంలో ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.98 కోట్లతో అధునాతన సౌకర్యాలతో శ్మశానవాటికను అభివృద్ధి చేస్తున్నారు. పట్టణంలో ప్రధానమైన ఈ శ్మశానవాటిక అధ్వానంగా తయారైంది. గత మున్సిపల్ పాలకవర్గాలు ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. చుట్టూ చెత్త, దుర్గంధంతో బరియల్ చేయడానికి వచ్చేవారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కూర్చోవడానికి షెడ్డు గానీ, దహనసంస్కారాలు, స్నానాలు చేయడానికి సౌకర్యాలు లేవు. ఇక వర్షం వస్తే పరిస్థితి మరింత దారుణం. శ్మశానవాటికకు వెళ్లే రోడ్డుమార్గం కూడా పాడయ్యింది.

రూ.1.98 కోట్లతో అభివృద్ధి

ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు చొరవతో శ్మశానవాటికను అభివృద్ధి చేయడానికి నిర్ణయించి పనులు మొదలు పెట్టారు. దహనసంస్కారాలు కోసం గ్యాస్‌తో మండే చితిని, పక్కన పుల్లలతో కాల్చే చితిని వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నారు. రెండు షెడ్డులు, చుట్టూ ప్రహరీ, గోదావరి వద్ద ప్రత్యేకంగా స్నానాల రేవు, శ్మశానవాటికకు వచ్చే రోడ్డును నిర్మిస్తున్నారు. పక్కనే ఉన్న స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసి దానిలో దహన సంస్కారాలకు వచ్చేవారు కూర్చోవడానికి, అలాగే తాగునీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో పూలమొక్కలు, చెట్లు వేసి సుందరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి పనులు చురుగ్గా సాగుతున్నాయి.



నరసాపురంలో గోదావరి గట్టున చురుగ్గా సాగుతున్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు

అన్ని వసతుల ఏర్పాటు



హిందూ శ్మశానవాటికను రూ.1.98 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. దాదాపు 40 శాతం పనులు పూర్తయ్యాయి. దహనసంస్కారం కోసం గ్యాస్ ఆధారిత యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. పక్కన అన్ని వసతులతో పార్కును అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. చుట్టూ ప్రహరీ కూడా నిర్మిస్తున్నాం. బరియల్ చేయడానికి వచ్చేవారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడతాం.
– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

చురుగ్గా దొరగారి చెరువు అభివృద్ధి పనులు

- చుట్టూ కాలిబాట నిర్మాణం
- ఫెన్సింగ్, రివిట్‌మెంట్ నిర్మాణం

ఆకివీడు: స్థానిక ప్రధాన సెంటర్‌లోని దొరగారి చెరువు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతోన్నాయి. గత పాలకుల నిర్లక్ష్యంతో తూడు, జమ్ముతో మురుగునీటికి నిలయంగా మారిన దొరగారి చెరువును అభివృద్ధి చేసేందుకు గత నెలలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్శింహారాజు భూమి పూజ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం, ఏపీ పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ నిధులు రూ. 62 లక్షల వ్యయంతో చెరువును ఆధునీకరిస్తున్నారు. చెరువును మంచినీటి చెరువుగానూ, చుట్టూ గట్టుకు రివిట్‌మెంట్ నిర్మాణం, గట్టుపై కాలిబాట రహదారి నిర్మాణంతో పాటు ఫెన్సింగ్ నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే చెరువు గట్టును శుభ్రం చేసి కాలిబాట కోసం గ్రావెల్ పనులు పూర్తి చేశారు. గ్రావెల్‌పై మిక్సర్ చిప్స్ వేసి నడక మార్గానికి అనువుగా అభివృద్ధి చేస్తారు. చెరువులో తూడు, జమ్మును తొలగిస్తున్నారు. భారీ పొక్లెయిన్‌తో పనులు ప్రారంభించారు. చెరువులోని పూడిక తొలగించి మంచినీటిని నింపనున్నారు. చెరువును ఆహ్లాదకరంగా తీర్చి చర్యల్లో భాగంగా పనులు వేగంగా జరగడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో మూడు దశాబ్దాలుగా మంచినీటి చెరువు కలుషితానికి గురై మూలన పడి ఉంది. దొరగారి చెరువును అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు మంచినీరు అందిస్తానని ఎన్నికల్లో పీవీఎల్.నర్శింహారాజు ఇచ్చిన హామీని నెరవేర్చుతుండటంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దొరగారి చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువులోని తూడు, జమ్ము తొలగిస్తున్న దృశ్యం

సదస్సుల్లో పాల్గొంటే మంచి ఫలితాలు

సాక్షి, భీమవరం: అంతర్జాతీయ సదస్సుల్లో అధ్యాపకులతో పాటు విద్యార్థులు కూడా పాల్గొంటే మంచి ఫలితాలు వస్తాయని భువనేశ్వర్ ఐఐటీకి చెందిన ప్రొఫెసర్ విజయ్ కృష్ణ అన్నారు. స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నానో టెక్నాలజీ పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో రెండు రోజుల మెటీరియల్స్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ (ఎంఈసీఏపీ) అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైన్సెస్, ఇంజినీరింగ్‌లో మెటీరియల్ ప్రాముఖ్యతను తెలుసుకునేందుకు అధ్యాపకులు, విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా సదస్సులో పాల్గొనటం అభినందనీయమన్నారు. విజయ్‌కృష్ణను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమానికి టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ హెడ్ వేణురెడ్డి అధ్యక్షత వహించగా కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, పి.భవాని, పి.రామ్మూర్తి రాజు, సోమేశ్వరరావు, దివాకర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విజయ్‌కృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

ఉచిత గుండె వైద్యశిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారితోట అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో మంగళవారం ఉదయం గుండె ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దలను కార్డియో తోరాసిస్ సర్జన్, స్థానిక తేజ హాస్పిటల్ అధినేత పానమండ చంద్రశేఖర వర్మ, 15 సంవత్సరాల్లోపు పిల్లలను విజయవాడ ఆంధ్రా హాస్పిటల్ పిల్లల గుండె వైద్య నిపుణుడు కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పరిశీలించి ఈసీజీ, ఎకో, 2డి ఎకో పరీక్షలు నిర్వహించారు. వైద్య సేవలు అందించారు. ఏబీఎస్‌వీకేకు సహకరిస్తోన్న వసుధ ఫౌండేషన్‌కు, డెక్కన్ ఫైన్ కెమికల్ (పి) లిమిటెడ్ సంస్థకు, ఎస్ఎల్‌జీ హాస్పిటల్స్ (హైదరాబాద్)కు, వైద్య సేవలు అందించిన డాక్టర్లకు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు అభినందనలు తెలిపారు. హాస్పిటల్ ప్రతినిధి రణదివే పాల్గొన్నారు.

నేడు నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం

ఆకివీడు: నగర పంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 27వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ జామి హైమావతి మంగళవారం చెప్పారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లందరూ హాజరుకావాలని ఆమె పిలుపునిచ్చారు.

రోడ్డు ఆక్రమణలను పరిశీలించిన ఆర్డీఓ

ఆకివీడు: రోడ్డు నిర్మాణం కోసం మార్జిన్లలో ఉన్న ఆక్రమణల తొలగింపుపై వచ్చిన ఆరోపణలతో ఆ ప్రాంతాన్ని మంగళవారం భీమవరం ఆర్డీఓ దాసి రాజు పరిశీలించారు. తరటావ నుంచి కొల్లేరు వెళ్లే రహదారిని అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టేందుకు రూ.25 కోట్ల వ్యయంతో పనులు చేపట్టాల్సి ఉంది. రోడ్డు విస్తరణ పనులకు ఆక్రమణలు అడ్డు రావడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆయా ప్రాంతాల్ని పరిశీలించారు. ఆక్రమణదారులకు ఇబ్బంది లేకుండా రోడ్డు విస్తరణకు అనువైన ప్రాంతాన్ని తీసుకునే విధంగా సమస్యను పరిష్కరించారు. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ యాదవ్, జేఈ శ్రీహరి, తహసీల్దార్ విజయలక్ష్మీ, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల నిర్మించిన సమావేశపు హాలుపై ఫిర్యాదులు రావడంతో దాతల్ని పిలిచి వారితో ఆర్డీఓ రాజు మాట్లాడారు. తాము షెడ్డు నిర్మాణానికి విరాళాలు అందించామని దాతలు చెప్పారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన జాబితా, దాతల వివరణల్ని తీసుకున్నారు.



పెద కాపవరంలోని ఆర్ అండ్ బీ రోడ్డు ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

సమన్వయంతో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: అధికారులంతా సమన్వయంతో పనిచేసి, ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని తాడేపల్లిగూడెం ఆర్డీవో పి.చెన్నయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణంపై నియోజకవర్గ స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చెన్నయ్య మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మండలానికి సంబంధించి పీఎం ఆవాస్‌లో 1900 ఇళ్లు లక్ష్యం కాగా, 855 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. జగనన్న ఇళ్ల పథకానికి 3029 మంజూరు కాగా, ఇప్పటి వరకు 2503 ఇంటి నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. స్థలం ఉండి ఇంటి నిర్మాణాలకు సంబంధించి 2298గాను 944 ఇళ్లు నిర్మించుకున్నట్లు తెలిపారు. పెంటపాడు మండలానికి సంబంధించి పీఎం ఆవాస్ కింద 1,266గాను 771 పూర్తయ్యాయని, స్థలం ఉండి ఇంటి నిర్మాణాలకు 1631 మంజూరు కాగా, 522 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. జగనన్న ఇళ్లు 2313 కాగా, 1246 పూర్తయినట్లు తెలిపారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. హౌసింగ్ ఇన్‌ఛార్జ్ ఈఈ వీఎస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ సేవలు అభినందనీయం

సాక్షి, భీమవరం: ఆటో కార్మికులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ నేత గ్రంధి రవితేజ అన్నారు. మంగళవారం భీమవరం చైతన్య ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ 25వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు మాట్లాడుతూ ఐక్యతతోనే ప్రగతి సాధించవచ్చుననడానికి ఆటో వర్కర్స్ అసోసియేషన్ నిదర్శమన్నారు. రవాణా శాఖ అధికారులు సీహెచ్ రమణ, కేఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నపడపవద్దని, నిబంధనలు పాటించాలని సూచించారు. తొలుత కొత్త బస్టాండ్ నుంచి ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కడలి హరిబాబు, వనం సోమేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు కాండ్రేగుల సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యమంలా ఎలుకల నిర్మూలన

మొగల్తూరు: ఎలుకల నిర్మూలన ఉద్యమంలా చేపట్టాలని జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ కోరారు. మంగళవారం మొగల్తూరు గొల్లగూడెంలో ఎలుకల నిర్మూలనకు నూకలు, నూనె కలిపిన బ్రోమోడయోలోన్ మందును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట లేని సమయంలో ఎలుకల నిర్మూలన చేపడితే వాటి సంఖ్యను చాలా వరకు తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహలక్ష్మి, వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, కవురు సుబ్బారావు, దొంగ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎర తయారీపై రైతులకు అవగాహన

యలమంచిలి: రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని ఏడీఏ ఈదా అనిల్‌కుమారి కోరారు. మంగళవారం ఆమె మేడపాడు రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశమై ఎలుకల నిర్మూలనకు ఎర ఎలా తయారుచేయాలో వివరించా రు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు కె.నాగలక్ష్మి, సొసైటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు డేగల వెంకటేశ్వరరావు, గాది వరదయ్య, బాలం రాంబాబు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనతో ప్రయోజనం

పెనుగొండ: రైతులు సామూహిక ఎలుకల నిర్మూ లన చేపడితే ప్రయోజనం ఉంటుందని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి.స్పందన అన్నారు. మండలంలోని వడలి గ్రామంలో పొలాల్లో తెరచి ఉన్న ఎలుకల బొరియల మూసివేతను ఆమె పరిశీలించారు. బుధవారం రైతులకు అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద బ్రోమోడయోలిన్ మందు కలిపిన విషపు ఎరను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బ్రోమోడయోలిన్ మందు పంపిణీ

పెనుమంట్ర: సామూహిక ఎలుకల నిర్మూలనకు వ్యవసాయశాఖ బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేసింది. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా ఈ మందు పంపిణీ చేశారు. మొత్తం 59 కిలోల బ్రోమోడయోలిన్ మందును నూకలు నూనెతో కలిపి గ్రామ పంచాయతీల వద్ద రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, మండల వ్యవసాయ అధికారి ఎ.జ్యోత్స్న, ఎంపీడీఓ పి.పద్మజ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

వరి పంటను కాపాడుకుందాం

నరసాపురం రూరల్: వరి పంటను కాపాడుకోవాలంటే సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని మండల ఎడ్వయిజరీ కమిటీ చైర్మన్ కాండ్రేగుల నరసింహారావు, ఆత్మా చైర్మన్ కడలి రాంబాబు, ఏడీఏ ఈదా అనిల్‌కుమారి అన్నారు. నరసాపురం మండలం సరిపల్లి గ్రామంలో మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. రైతులకు బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశారు. సరిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ క్షేత్రంలో సోమవారం గుర్తించిన ఎలుకల కన్నాల వద్ద నిర్మూలన మందు పొట్లాలను ఉంచారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఈదా సురేష్, ఎంపీటీసీ చిన్నం వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.



మొగల్తూరులో ఎలుకల నిర్మూలనకు మందు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాపూజీ



నరసాపురం మండలం సరిపల్లిలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు